# ఆత్మగౌరవమా? ఢిల్లీ అహంకారమా?

- తెలంగాణ ఆత్మగౌరవంపై విపక్షాల దాడి
- తిప్పికొట్టకపోతే ఇబ్బంది తప్పదు
- బీసీ గణనపై తీర్మానం కేంద్రానికిచ్చాం
- కాంగ్రెస్ రాష్ట్రాల్లో ఎందుకు చేయలేదు?
- కాంగ్రెస్‌కు సీఎంలున్నారు.. ఓటర్లే లేరు
- మూడో సారీ సీఎం కేసీఆరే: కేటీఆర్
- బీఆర్ఎస్‌లోకి రావుల, జిట్టా, మామిండ్ల



శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన రావుల చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ పౌరుషానికి.. ఢిల్లీ, గుజరాత్ అహంకారానికి మధ్య జరుగుతున్న పోటీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు అన్నారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం మీద జరుగుతున్న దాడిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆత్మగౌరవం కావాలా? ఢిల్లీ గులాంలు, గుజరాత్ బానిసలు కావాలో తెల్చుకోవాల్సిన సమయం అసన్నమైందని అన్నారు. కేసీఆర్ ప్రభుతాన్ని ఎందుకు దించాలి? కేసీఆర్ పాలనలో ఏం తక్కువైంది? అని ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ బీఆర్ఎస్‌లో చేరారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన నేతలకు కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణను ఆగం చేయాలను చూస్తున్న వారి కుట్రలను భగ్నం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

### ఈన కాచి నక్కల పాలు చేయొద్దు

గద్దలు, తోడేళ్లు, నక్కలు తెలంగాణపై దాడి చేయడానికి ఎదురు చూస్తున్నాయని, ఈన కాచి నక్కల పాలు చేయొద్దని మంత్రి కేటీఆర్ ప్రజలకు సూచించారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ చేయబోమంటూ అమరవీరుల స్థూపం వద్ద ప్రమాణం చేద్దామని రేవంత్‌రెడ్డి లాంటి వ్యక్తి సవాల్ విసిరడం, హంతకుడే నివాళులు అర్పించినట్టుగా ఉన్నదని అన్నారు. డబ్బులు పంచుతూ దొరికిన రేవంత్‌రెడ్డి, డబ్బులపై ప్రమాణం చేయడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. 'నిజాం కబంధ హస్తాల నుంచి తెలంగాణను ఒక గుజరాతీ విడిపించాడని ప్రధాని మోదీ అంటున్నారు. మరో గుజరాతీ అభివృద్ధి నేర్పిస్తా అంటున్నాడు. ఇది తెలంగాణ అస్తిత్వం మీద దాడే. ఇలా దాడి జరుగుతుంటే చూస్తూ ఉందామా?' అని ప్రశ్నించారు. 'దేశంలో ఒక్క తెలంగాణ తప్ప మిగతా రాష్ట్రాలు బీజేపీ, కాంగ్రెస్ చేతిలోనే ఉన్నాయి. మరి తెలంగాణకు చేతనైన అభివృద్ధి మిగతా రాష్ట్రాలకు ఎందుకు సాధ్యం కావడం లేదు? కేసీఆర్ పరిపాలనలో ఏం తక్కువైంది? టీఆర్ఎస్ పార్టీని సీఎం కేసీఆర్ స్థాపించకపోతే, తెలంగాణ ఏర్పాటు అనివార్యతను కల్పించకపోతే.. ఇప్పుడు టీ పీసీసీ, టీ బీజేపీ ఉండేవా? రేవంత్‌రెడ్డికి, కిషన్‌రెడ్డికి పదవులు ఉండేవా?' అని నిలదీశారు.

### మాది ప్రజల టీం

కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమం ఒకవైపు, అభివృద్ధి ఇంకోవైపు జరిగిన మాట వాస్తవం కాదా? అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ప్రధాని మోదీ వచ్చి కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ బీ టీం అంటారు.. రాహుల్ గాంధీ వచ్చి బీజేపీకి బీఆర్ఎస్ బీ టీం అంటారు. తాము ఎవరి టీం కాదు. తెలంగాణ ప్రజల ఏ టీం. మోదీ, రాహుల్ ఒకరినొకరు పార్లమెంట్‌లో కౌగిలించుకుంటారు.. సహకరించుకుంటారు.. కన్ను కొట్టుకుంటారు.. ఇప్పుడు ఇద్దరు కలిసి మమ్మల్ని విమర్శిస్తున్నారు. కరీంనగర్, నిజామాబాద్‌లో మీ రెండు పార్టీలు కలిసి పనిచేయలేదా? మణికొండ, మక్తల్‌లో చైర్మన్ పదవులను పంచుకోలేదా? బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్, సోనియా గురించి బాగా చెప్పింది రేవంత్ రెడ్డి. రాహుల్‌గాంధీ ఒక ముద్ద పప్పు అన్నది రేవంత్ రెడ్డే. మరిప్పుడు రాహుల్ నిప్పు ఎలా అయ్యారు? నాడు బలిదేవత అన్న సోనియాగాంధీ, ఇప్పుడు కాళీ మాత ఎలా అయ్యింది? వందల మంది తెలంగాణ బిడ్డలను చంపింది కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ కొంపముంచిదే కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ ప్రజలను గోస పెట్టింది, అవమానపరిచింది కాంగ్రెస్ పార్టీ' అని మండిపడ్డారు. రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని 9 నెలల క్రితమే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. కొత్తగా ఇప్పుడు రాహుల్‌గాంధీ వచ్చి కుల గణన చేస్తామని చెప్తున్నారని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బీసీ కుల గణన చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

### కేసీఆర్ పాలనలో ఏం తక్కువైంది?

కేసీఆర్ పాలనలో ఎవరికి ఏం తక్కువైందని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. 'కరెంటు, తాగు, సాగు నీరు బాగైంది. వ్యవసాయం, విద్య, వైద్యం బాగైంది. సంపద, తలసరి ఆదాయం పెరిగింది. భూముల విలువ పెరిగింది. మరి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎందుకు దించేయాలి? 13 లక్షల మంది ఆడపిల్లల పెళ్లిళ్లు చేసినందుకు దించేయాలా? 70 లక్షల రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లు జమ చేసినందుకు దించేయాలా? రైతాంగానికి 24 గంటలు కరెంట్ ఇచ్చినందుకా? రైతు బంధు ఇచ్చినందుకా? మిషన్ భగీరథ ద్వారా నీళ్లు ఇచ్చినందుకా? యాదాద్రి ఆలయాన్ని నిర్మించినందుకా ? తండాలను పంచాయతీలు చేసినందుకా? కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు చేసినందుకా? కొత్త జిల్లాలు చేసినందుకా? మా కంటే బాగా మీరు చేసింది ఏమైనా ఉంటే చెప్పండి. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేసుకోలేదా? ముదిరాజ్, చేనేత, కల్లు గీత కార్మికులను ఆదుకున్నది కేసీఆర్ కాదా? బీసీ బంధు ద్వారా కుల వృత్తులను ఆదుకొంటున్నది కేసీఆర్ కాదా? దళితబంధు ఇస్తున్నది కేసీఆర్ కాదా? మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తున్నది కేసీఆర్ కాదా? ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ పెట్టిం ది కేసీఆర్ కాదా? చేనేతకు బడ్జెట్‌ను 200 రెట్లు పెంచింది కేసీఆర్ కాదా? గిరిజనులకు రిజర్వేషన్లు పెంచింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటున్నదని, అంటే ఎమర్జెన్సీ రోజులు తెస్తారా? అని ఎద్దేవా చేశారు. మోదీని బీజేపీ వాళ్లు దేవుడు అంటున్నారని, వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.400 నుంచి రూ.1200 చేసినందుకు మోదీ దేవుడా? అని ప్రశ్నించారు.

### పచ్చబడ్డ పాలమూరు: నిరంజన్‌రెడ్డి

సీఎం కేసీఆర్ పాలనలో పాలమూరు జిల్లాలో అద్భుతమైన అభివృద్ధి సాధ్యమైందని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లాను మరింత అభివృద్ధి చేయడానికి అందరం కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ దూరదృష్టి గల నేత అని ప్రశంసించారు. కేసీఆర్ ప్రభుత్వం బాగా పనిచేసిందని, అందుకే తాను బీఆర్ఎస్‌లో చేరానని చెప్పారు. మూడో టర్మ్ కూడా కేసీఆర్ సీఎం కావాలన్నదే తన లక్ష్యమని, బీఆర్ఎస్ అభ్యర్థుల విజ యం కోసం కృషి చేస్తానని ప్రకటించారు. జిట్టా బాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులందరు ఒక్క చోటికి రావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. మ రొక్కసారి మోసపోతే గోస పడుతామని తెలిపారు. టీఎన్జీవో నేత మామిళ్ల రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగులను భారతదేశంలో నంబర్ వన్‌గా ఉండాలన్న లక్ష్యంతో కేసీఆర్ తీర్చిదిద్దారని అన్నారు. బీఆర్ఎస్‌లోకి వచ్చి ఉద్యోగులు, పెన్షనర్లకు ఇంకా మంచి కార్యక్రమాలు చేయాలని కేసీఆర్ సూచించారని, అందుకే ఇంకా రెండు సంవత్సరాల సర్వీసు ఉన్నా రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ పీ రాములు, ఎమ్మెల్యేలు ఫైళ్ల శేఖర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్రహం, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి మంద జగన్నాథం, మాజీ ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, గీత కార్మిక సంస్థ చైర్మన్ పల్లె రవి, వికలాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్‌పై పోరుకు ఒక్కటైన మోదీ, రాహుల్

సీఎం కేసీఆర్ వల్ల ఎవరికి అన్యాయం జరిగిందో చెప్పాలని మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. అడగకముందే ముదిరాజ్ బిడ్డను రాజ్యసభ సభ్యునిగా చేసింది కేసీఆర్ కాదా? ప్రశ్నించారు. ముదిరాజ్‌లకు రాబోయే రోజుల్లో రాజ్యసభ, మండలి, కార్పొరేషన్ చైర్మన్లలో సముచిత గౌరవం, ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 'కాంగ్రెస్, బీజేపీకి సీఎం కేసీఆర్ కొరకరాని కొయ్యగా మారారు. అందుకే ఆయనను ఇక్కడే తొక్కేయాలని ఆ రెండు పార్టీలు చూస్తున్నాయి. తెలంగాణ పౌరుషానికి.. ఢిల్లీ, గుజరాత్ అహంకారానికి మధ్య జరుగుతున్న పోటీలో మనమే విజయం సాధించాలి. కేసీఆర్ జాతీయ శక్తిగా ఎదుగుతారని బీజేపీ, కాంగ్రెస్ భయపడుతున్నాయి. దసరా వస్తున్నది.. తెలంగాణకు ఏది మంచిదో ఊళ్లలో చర్చ పెట్టండి. కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రులు దొరికారు. కానీ ఓటర్లు దొరకుతలేరు. ఎవ్వరూ రంది పెట్టుకోకండి. మళ్లీ సీఎం అయ్యేది కేసీఆరే' అని పేర్కొన్నారు. రావుల చంద్రశేఖర్‌రెడ్డి అజాత శత్రువుకు పర్యాయ పదమని ప్రశంసించారు. ఆయన రాకతో మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ బలం మరింత పెరిగిందన్నారు.

### వారంలో మరో రూ.3 వేల కోట్ల రుణమాఫీ

**రైతు** రుణమాఫీపై ఎవ్వరూ ఆందోళన చెందొద్దని మంత్రి కేటీఆర్ సూచించారు. రెండో టర్మ్‌లో రూ.19,445 కోట్ల రుణాలు చేయనున్నామని చెప్పారు. ఇప్పటికే రూ.13,600 కోట్లు మాఫీ అయ్యాయని, మరో రూ.3 వేల కోట్లు వచ్చే వారంలో రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. పేదలకు రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పారు. కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలలో ఒక్క మోటరు ఆన్ చేస్తేనే కాంగ్రెస్ నేతలు ఉక్రోశపడుతున్నారని, మొత్తం 31 మోటర్లు ఆన్ చేస్తే వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అని ఎద్దేవా చేశారు. 'ఓటేసేటప్పుడు అన్నీ ఆలోచించండి. రాష్ట్రాన్ని ఎవరి చేతిలో పెట్టాలి అనేది చాలా కీలకం. రేవంత్‌రెడ్డి పుట్టు పూర్వోత్తరాలు పాలమూరు ప్రజలకు తెలుసు. మన కంటిని మనమే పొడుచుకోవద్దు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎల్ఐసీ ఏజెంట్లలా ప్రజలను ఒప్పించాలి. ఒక్కొక్క ఓటు పోగు చేసి కేసీఆర్‌కు ఓట్ల దీవెన అందించాలి' అని సూచించారు.



నంది అవార్డు గ్రహీత, న్యాయవాది లక్ష్మణ్ గంగ రూపొందించిన 'విజయీభవ కేసీఆర్' పాట సిడీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు శుక్రవారం ప్రగతిభవన్‌లో విడుదల చేశారు. పాట నిర్మాత అడ్వకేట్ పత్తి ప్రవీణ్‌కుమార్, సంగీతం అందించిన సురేశ్ బొబ్బిలి, దర్శకుడు అభిలాశ్ సీఎచ్, ఎడిటర్ చెన్నూరి శివకుమార్‌ను కేటీఆర్ అభినందించారు.

## కుల గణనపై కాంగ్రెస్ కహానీ!

మొదటిపేజీ తరువాయి...

ప్రతి కుటుంబ సమాచారం సేకరించాలని నిర్ణయించారు. అయితే సాధారణ జనాభా గణన మాదిరిగా చేపడితే నెలలు, ఏండ్ల సమయం పడుతుంది. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా ఒకే రోజు సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. 2014 ఆగస్టు 19వ తేదీన 'సమగ్ర కుటుంబ సర్వే' జరిగింది. దీనికి ప్రజలు పెద్ద ఎత్తున సహకరించారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వలస వెళ్లినవారు సైతం సీఎం కేసీఆర్ మాటను గౌరవించి, సమగ్ర కుటుంబ సర్వే రోజు సొంత ఊర్లకు వెళ్లి వివరాలు అందజేశారు. దాదాపు కోటి కుటుంబాలు ఈ సర్వేలో పాల్గొని వివరాలు అందజేశాయి. ఎన్యూమరేటర్లు సేకరించిన వివరాలను అధికారులు విశ్లేషించారు. 2015 జనవరి నాటికి సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు తేలాయి.

### మొదటి నుంచీ కాంగ్రెస్ దగా

కుల గణన నిర్వహణలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ దగా చేస్తూనే ఉన్నది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పదేండ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలు సేకరిస్తున్నా, పూర్తి స్థాయిలో కుల గణన చేపట్టలేదు. 1953లో ఏర్పాటైన కాకా ఖలేల్కర్ కమిషన్ కేంద్రానికి సమర్పించిన నివేదికలో 1961 జనాభా లెక్కల సమయంలోనే కుల గణన కూడా చేపట్టాలని సూచించింది. కానీ కాంగ్రెస్ పట్టించుకోలేదు. 2011లో జనాభా లెక్కలతోపాటే 46 లక్షల కులాలు, ఉపకులాలు, గోత్ర నామాల ఆధారంగా ప్రాంతాలవారీగా జనాభా లెక్కలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించింది. అయితే అందులోని వివరాలు అసమగ్రంగా ఉన్నాయంటూ సాంకేతిక కారణాలతో ఆ నివేదికను పక్కన బెట్టింది. ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన మొదటి కులగణన వివరాలు ప్రపంచానికి తెలియకుండా పోయాయి. సమాజంలోని కులాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ పాపంలో బీజేపీ వాటా కూడా ఉన్నది. గతంలో అధికారంలో ఉన్న సమయంలో, 2021లో అధికారంలో ఉన్న సమయంలోనూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులగణనను పట్టించుకోలేదు. 2021లో ప్రధాని మోదీ ప్రభుత్వం కనీసం జనాభా లెక్కలు కూడా నిర్వహించలేదు. దీంతో సామాజిక స్థితిగతులు తెలియడం లేదని, అనేక ఉపకులాలు మరింత నిరాదరణకు గురవుతున్నాయని, ఎలాంటి అవకాశాలను, రిజర్వేషన్లను పొందలేకపోతున్నాయని అనేక కమిటీలు స్పష్టం చేశాయి. వెంటనే జనాభా గణన, కుల గణన చేపట్టాలని నిపుణులు నెత్తీనోరు మొత్తుకుంటున్నా కేంద్రంలోని బీజేపీగానీ, ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌గానీ పట్టించుకోవడం లేదు. కులాల వారీగా సమగ్ర వివరాలను సేకరిస్తే సామాజంలో చీలికలు ఏర్పడి, ఆయా వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తుతాయని సాకులు చెప్తున్నాయి.

### పథకాల అమలుకు ప్రామాణికం

**సమగ్ర** కుటుంబ సర్వే ద్వారా తెలంగాణలో ప్రజల జీవన ప్రమాణాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు ప్రభుత్వానికి తెలిశాయి. 'భవిష్యత్తులో ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, భావి తెలంగాణ నిర్మాణానికి ఈ వివరాలు ప్రామాణికం కానున్నాయి' అని ప్రభుత్వం ఆనాడే చెప్పింది. ఈ వివరాలను ప్రామాణికంగా చేసుకొని ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టింది. ప్రాజెక్టులు, పథకాలతో వ్యవసాయాన్ని స్థిరీకరించడం, రైతులకు అండగా నిలవడం, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు పెన్షన్లు, యాదవులకు గొర్రెల పంపిణీ పథకం, రజకులకు, నాయీ బ్రాహ్మణులకు, ఇతర వర్గాలకు సబ్సిడీలు, దళితుల అభ్యున్నతికి పథకాలు వంటి అనేక కార్యక్రమాలను ఈ సర్వే వివరాల ఆధారంగానే ప్రభుత్వం చేపట్టింది. ఏయే వ్యాధులతో ఎంత మంది బాధపడుతున్నారో కూడా ఈ సర్వేతో గుర్తించింది. వైద్యరంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి, పటిష్ఠం చేసింది. తద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచింది.

## 'కామారెడ్డి'కి సమన్వయ కమిటీ

**సభ్యులుగా కేటీఆర్, గంప, సుభాశ్‌రెడ్డి**

**సీఎం కేసీఆర్‌కు భారీ మెజార్టీ లక్ష్యంగా కార్యాచరణ**

నిజామాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్ట వ్యూహంతో ముందుకెళ్తున్నది. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. వీరితోపాటు ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, సీనియర్ నాయకులు నిట్టు వేణుగోపాల్, పున్నా రాజేశ్వర్, ఎల్ నర్సింగరావుకు కమిటీలో స్థానం కల్పించారు. మండలాలవారీగా కూడా సమన్వయ కమిటీలను నియమించనున్నట్టు ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడం, లోటుపాట్లు ఉంటే సరిచేసుకుంటూ బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీయే లక్ష్యంగా పని చేయనున్నట్టు పేర్కొన్నారు.

## అవినీతి గురించి రాహుల్ మాట్లాడటమా?

- పీసీసీ చీఫ్ పదవిని కొన్న చరిత్ర రేవంత్‌ది
- రేవంత్‌పై ఈడీకి కాంగ్రెస్ నేత ఫిర్యాదు
- ఎక్స్‌లో మంత్రి కే తారక రామారావు ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): అవినీతి గురించి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ టికెట్లు అమ్ముకున్నారని రేవంత్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులే ఈడీకి ఇటీవల ఫిర్యాదు చేశారని ఆయన గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డిపై గతంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాజాగా గద్వాల నేత విజయ్‌కుమార్ చేసిన ఫిర్యాదుల వార్తల క్లిప్పింగులను శుక్రవారం ఎక్స్‌లో మంత్రి కేటీఆర్ షేర్ చేశారు. ఓటుకు నోటు కేసులో ఇప్పటికే అడ్డంగా రేవంత్‌రెడ్డి పట్టుబడ్డారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ అవసరం లేదని గాంధీజీ అన్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారు పార్టీలో ఉంటారని మహాత్ముడు ఆనాడే ఊహించారేమోనని విమర్శించారు. పీసీసీ అధ్యక్ష పదవిని రూ.50 కోట్లకు అమ్మారని ఎంపీ కోమటిరెడ్డి అన్నారని, ఒకరు పీసీసీ ప్రెసిడెంట్‌ను విక్రయిస్తే మరొకరు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఇంత అవినీతి పార్టీలో ఉన్న రాహుల్ అవినీతిపై మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. అవినీతి అనేది స్కాంగ్రెస్ పేరులోనే ఉన్నదంటూ మరో పోస్టు చేశారు.

## రాహుల్‌కు హైదరాబాద్‌లో పోటీ చేసే దమ్ముందా?

**ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సవాల్**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): రాహుల్‌గాంధీకి హైదరాబాద్‌లో పోటీ చేసే దమ్ము ఉన్నదా? అని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సవాల్ చేశారు. బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకు ఎంఐఎం పార్టీ అస్సాం, మహారాష్ట్ర, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో అభ్యర్థులను నిలబెట్టిందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పాతబస్తీలో నిర్వహించిన ఎన్నికల సభలో మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చెప్తున్నట్టుగా ఎంఐఎం ఎన్నడూ అస్సాంలో పోటీ చేయలేదని స్పష్టంచేశారు. రాహుల్ గాంధీ ఓడిపోయిన అమేథిలో ఎంఐఎం పోటీ చేసిందా? అని ప్రశ్నించారు. ఎంఐఎం రాజస్థాన్‌లో తొలిసారిగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెప్పారు.

## కాంగ్రెస్‌కు చెరుకు సుధాకర్ రాజీనామా

- బీసీలను వెక్కిరిస్తున్న కాంగ్రెస్ పెద్దలు
- పొన్నాలపై వ్యాఖ్యలు దారుణం
- డబ్బున్న నేతలకే పార్టీలో ప్రాధాన్యం
- మధుయాష్కీ స్థాయిని తగ్గించే కుట్రలు
- రేవంత్‌కు రాసిన లేఖలో చెరుకు ఫైర్

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన అనంతరం నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న చెరుకు సుధాకర్

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): బీసీ నేతల విషయంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నేతల తీరును నిరసిస్తూ పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఏ పదవీ లేకపోయినా భరించవచ్చు గానీ ఆత్మగౌరవం లేని రాజకీయ ప్రయాణం నిష్ప్రయోజనం అని భావించి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇంతకంటే మెరుగ్గా ఉన్న మరో వేదిక వెతుకులాటలో ఉన్నట్టు తెలిపారు. ఒకటి రెండ్రోజుల్లో బీఆర్ఎస్‌లో చేరనున్నట్టు సూచనప్రాయంగా వెల్లడించారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన చెరకు సుధాకర్ అక్కడే కాంగ్రెస్‌కు రాజీనామా ప్రకటించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి లేఖ విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ఆర్థిక పరిపుష్టి కలిగిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని, మధుయాష్కీ వంటి బీసీల నేతల స్థాయిని తగ్గిస్తూ అవమానకరంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చెప్తున్న సామాజిక న్యాయం కేవలం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ మాటల్లో తప్ప ఆచరణలో లేదని విమర్శించారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు సీట్లు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ చివరకు మోసం చేసిందని దుయ్యబట్టారు. బీసీలకు కేటాయించిన 12 సీట్లలో ఐదు చోట్ల ఎప్పుడూ కాంగ్రెస్‌కు డిపాజిట్ రాలేదని చెప్పారు. వీటిని పట్టుకుని బీసీలకు 12 సీట్లు ఇచ్చామంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెక్కిరింపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పొన్నాల లక్ష్మయ్య రాజీనామా సమయంలో రేవంత్‌రెడ్డి అత్యంత అవమానకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గెలుపు గుర్రాల పేరుతో నందికంటి శ్రీధర్ వంటి వాళ్లను బలిపశువులను చేశారని, బీసీలకు ఇంతకంటే అవమానం ఏముంటుందని ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇష్టారీతిలో వ్యవహరిస్తూ తన సొంత నియోజకవర్గమైన నకిరేకల్‌లో కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వేముల వీరేశాన్ని అభ్యర్థిగా ప్రకటించారని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క సాక్షిగా నకిరేకల్ గడ్డపై తనను మాట్లాడనీయకుండా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మనుషులు అడ్డుకున్న విషయం అక్కడి ప్రజలు మర్చిపోలేదని చెప్పారు. ప్రజా తెలంగాణ లక్ష్యమని చెప్తున్న కాంగ్రెస్ పెద్దలు కరుడుగట్టిన భూస్వామ్య స్వభావంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

## లోకం పోకడ

తాతయ్య, నానమ్మ, నాన్న, అమ్మ, అన్నయ్య... కుటుంబ పాలనను ఎండగట్టే స్పీచ్ ఇవ్వడానికి వెళ్తున్నా.. దీవించండి!

## నోటిఫికేషన్‌కు ముందే ఎస్సెస్టీలు

**తనిఖీ విధుల్లోకి 374 బృందాలు**

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా భారీగా నగదు, మద్యం, బంగారం పట్టుబడుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్సెస్టీ)లను ముందుగానే రంగంలోకి దించింది. ఎన్నికల ప్రభావాలను కట్టడి చేయాలని రాష్ట్రవ్యాప్తంగా 374 ఎస్సెస్టీలను రంగంలోకి దించారు. నియోజకవర్గానికి మూడు ప్రత్యేక బృందాలను పంపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక బృందాల్లో తప్పనిసరిగా మేజిస్ట్రేట్ స్థాయి అధికారి ఒకరు, నలుగురు పోలీసు సిబ్బంది, అవసరమైతే కెమెరామెన్ అందుబాటులో ఉంటారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 37.2°c | 17.1°c |
| ఆదిలాబాద్ | 36.4°c | 19.9°c |
| నల్లగొండ | 36.0°c | 22.4°c |
| మెదక్ | 34.5°c | 17.5°c |
| ఖమ్మం | 34.0°c | 21.0°c |
| నిజామాబాద్ | 33.9 °c | 22.2°c |
| కరీంనగర్ | 33.0°c | 23.0°c |
| వరంగల్ | 33.0°c | 22.0°c |
| మహబూబ్‌నగర్ | 32.0°c | 22.6°c |
| హైదరాబాద్ | 33.0°c | 22.5°c |

## నిపుణ